తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 59 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ మంగళవారం 1-10-2024 వెల: 5/రూ -



# విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి

- అంకిత భావంతో కష్టపడాలని సూచన
- సమస్యలు, అభ్యర్థనలు ఏమిటో అడిగి తెలుసుకున్నారు
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి


**పటాన్చెరు, సెప్టెంబర్ 30:(డైలీ రిపోర్ట్):** పఠాన్చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రాత్రి బస చేశారు. కలెక్టర్ రాత్రి 7.30 గంటల ప్రాంతంలో రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల స్టడీ అవర్స్ కొనసాగుతుండడాన్ని గమనించి, వారికి అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ వంటి అంశాలను పాఠశాల ప్రిన్సిపాల్ కల్పనను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల గదులను సందర్శించి, వారు చేస్తున్న అధ్యయనం, అందుకు అందుతున్న వసతులు వంటి వివరాలను సమీక్షించారు. పదవ తరగతి మరియు ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు.

- మిగతా 2వ పేజీలో

# తహసీల్దార్ ఏది చెబితే అది చేస్తారా?

## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో నిర్మాణం కూల్చివేతపై న్యాయమూర్తి విచారణ
- హైడ్రా కమిషనర్‌తో పాటు తహసీల్దార్‌పై ప్రశ్నల వర్షం
- మీకు చట్టం తెలియదా? స్టే ఉన్న ఆస్తిని సెలవు రోజు ఎందుకు కూల్చారు?
- విస్తృత ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు పాటించరా?
- రాజకీయ నాయకులు చెప్పింది వింటేఇబ్బందులు పడేది మీరేనన్న న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్
- నిర్మాణంపై స్టేటస్ కో.. విచారణ 15కు వాయిదా



హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూల్చివేత ఘటనపై హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'హైకోర్టును కూల్చివేయాలని తహసీల్దార్ లేఖ రాస్తే సిబ్బందిని, యంత్రాలను ఏర్పాటు చేస్తారా? మీకు చట్టం తెలియ దా? ఆదివారం, సూర్యాస్తమయం తరువాత కూల్చి వేత చేపట్టవద్దని విస్తృత ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు పాటించరా? చట్టం తెలియకపోతే ప్రభుత్వ న్యాయవాదులను అడిగి తెలుసుకోరా? మీడియా తో మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తారా?'అంటూ మండిపడింది.

- మిగతా 2వ పేజీలో

# లెబనాన్‌లోకి ఇజ్రాయెల్!

- అమెరికాకు సమాచారం.. సరిహద్దుల్లో వైదొలగిన లెబనాన్ ఆర్మీ
- యుద్ధ ట్యాంకులతో అల్-వజానీ, అల్-ఖియామ్ వైపు ఐడీఎఫ్
- ఇజ్రాయెల్‌పై ఇరాక్, ఇరాన్, సిరియా దాడులకు అవకాశం
- లెబనాన్‌కు ఐఆర్‌జీసీ.. సిరియాకు హిజ్బుల్లా నాయకులు
- ఇరాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను మట్టుబెడతాం: నెతన్యాహు
- నెతన్యాహుకు మోదీ ఫోన్.. ఉగ్రవాదానికి చోటు లేదని వ్యాఖ్య

- మిగతా 2వ పేజీలో





# సిద్ధరామయ్యపై ఈడీ కేసు

## ముడాపై మనీలాండరింగ్ అభియోగం

## మరిన్ని చిక్కుల్లో కర్ణాటక సీఎం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: ముడా భూముల కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరిన్ని చిక్కుల్లో కూరుకుపోతున్నారు. ఈ స్కామ్‌పై తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగింది. రాష్ట్ర లోకాయుక్త పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా సిద్ధరామయ్య, మరికొందరిపై మనీలాండరింగ్ కేసు నమోదుచేసింది.

- మిగతా 2వ పేజీలో

# 9న టీచర్ నియామక పత్రాలు

- ఎల్‌బీ స్టేడియంలో కార్యక్రమం నిర్వహించి అందజేస్తాం: సీఎం రేవంత్
- 65 రోజుల్లోనే డీఎస్సీ పూర్తి చేశాం.. విద్యా రంగానికి నిధులు పెంచాం
- విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా బడులను కొనసాగిస్తామని వెల్లడి
- డీఎస్సీ-2024 ఫలితాలను విడుదల చేసిన ముఖ్యమంత్రి
- త్వరలోనే గ్రూప్-1 పరీక్షల ఫలితాలను విడుదల చేస్తామని ప్రకటన





# మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వు బ్యాంకు


- దేశ వ్యాప్త ఎన్నికల నిధుల కోసం భారీ కుంభకోణానికి శ్రీకారం: కేటీఆర్
- వివేక్, కేవీపీ లాంటి వారి ఇళ్లతోపాటు మీ సోదరుడి ఇంటిని కూల్చండి
- మూసీ బాధితులపాలిట రేవంత్‌రెడ్డి కాలయముడిలా మారారు

హైదరాబాద్/అత్తాపూర్: మూసీ ప్రాజెక్టు పేరుతో దేశంలోనే అతిపెద్ద కుంభకోణానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెర లేపిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును కాంగ్రెస్ రిజర్వు బ్యాంకులా వాడుకోవాలని చూస్తోందన్నారు.

- మిగతా 2వ పేజీలో

# నేరస్థులను వదలొద్దు

- రాజకీయ అరాచక శక్తులను ఉపేక్షించొద్దు
- పోలీసుల పనితీరులో మార్పు కనిపించాలి
- గత ప్రభుత్వ తాలూకు వాసనలు ఒక్క పోలీసు స్టేషన్‌లోనూ కనిపించరాదు
- వనరులు దోపిడీ చేసిన దొంగలు జైలుకెళ్లాలి
- ఐదేళ్లూ ప్రజల్ని వేధించిన వారికి శిక్ష పడాలి
- పోలీసు ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు
- తిరుమల కొండపైన అక్రమాలపై ఆరా



అమరావతి: నేరాలకు పాల్పడే వ్యక్తులు ఎవరైనా, ఎంతటి వారైనా వదిలి పెట్టొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రాజకీయ ముసుగు వేసుకుని అరాచకాలకు తెగబడే శక్తులపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం అమరావతిలోని ఏపీ సచివాలయంలో సీఎస్, డీజీపీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, సీఐడీ ఏడీజీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌తో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి, గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమాలు, అవినీతి కేసుల స్థితి గతులపై అధికారులతో మాట్లాడారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల కొండపైన అక్రమాలపై విజిలెన్స్ నివేదికలోని అంశాలను ప్రస్తావించారు. వైసీపీ నేతలు అడ్డగోలుగా జారీచేసిన బ్రేక్ దర్శనాల టికెట్లకు కమీషన్ల వసూళ్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది సంఖ్యలో చూపించిన తేడాలు, ఇతర అంశాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. పోలీసుల పనితీరులో అన్ని చోట్లా మార్పు కనిపించాలని, గత ప్రభుత్వ వాసనలు ఒక్క పోలీసు స్టేషన్‌లోనూ కనిపించడానికి వీల్లేదని డీజీపీ తిరుమలరావుకు సూచించినట్లు తెలిసింది.

- మిగతా 2వ పేజీలో

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి





(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులను పరిశీలించి, వారు సరైన విధంగా చదువుతున్నారా అనే విషయంపై దృష్టి పెట్టారు. తర్వాత కలెక్టర్ అన్ని తరగతి గదులను, డార్మెటరీలు, కిచెన్, డైనింగ్ హాల్ వంటి ప్రదేశాలను సందర్శించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతులు, విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు సరైన విధంగా ఉన్నాయా అన్నది పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉన్న సరుకుల నాణ్యతపై కూడా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వారికి ఉన్న సమస్యలు, అభ్యర్థనలు ఏమిటో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యా విధానాలు ఎంతవరకు సరైన రీతిలో అమలవుతున్నాయో తెలుసుకోవడానికి కలెక్టర్ ఈ రాత్రి బస కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రంతా పాఠశాలలోనే ఉండి, విద్యార్థులతో కలిసి గడపనున్నారు. ఈ సందర్భన ద్వారా విద్యా, వసతి, భోజన వంటి సదుపాయాలు బాగున్నాయా అని సమీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ అధికారి దేవుజా, తాసిల్దార్ రంగారావు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

# తహసీల్దార్ ఏది చెబితే అది చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

స్టే ఇచ్చిన ఆస్తిని సెలవు రోజు ఎందుకు కూల్చాల్సి వచ్చిందన్న దాని కి సమాధానం ఉందా అని ప్రశ్నించగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్, అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ సమాధానం చెప్పలేదు. హైడ్రా ఏర్పాటు అభినందనీయమే అయినా పని తీరు మాత్రం అసంతృప్తికరమని వ్యాఖ్యానించింది. రాజకీయ నాయకులు చెప్పింది వింటే ఇబ్బందులు పడేది మీరే అన్న విషయం గుర్తుంచుకోవాలని హెచ్చరించింది. తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేస్తూ, అలోగా కౌంటర్ దాఖలు చేయాలని హైడ్రా, తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసింది. అప్పటివరకు ఆస్తిపై స్టేటస్ కో విధించింది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ గ్రామపంచాయతీ పరిధి సర్వే నంబర్ 165, 166లోని 270 గజాల స్థలంలో నిర్మాణానికి 2022, నవంబర్ 10న మహ్మద్ రఫీ భవన నిర్మాణ అనుమతి పొందారు. అయితే ఆ స్థలం సర్వే నంబర్ 164లో ఉందని, అది ప్రభుత్వ భూమి అంటూ అధికారులు అనుమతి రద్దు చేశారు. ఈ క్రమంలో నోటీసులు జారీ చేసి ఆదివారం ఆ స్థలంలోని నిర్మాణాన్ని కూల్చివేశారు. దీన్ని సవాల్ చేస్తూ రఫీ, గణేశ్ నిర్మాణ సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. గత విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్ హాజరుకావాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో సోమవారం తహసీల్దార్ నేరుగా, కమిషనర్ వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అడిగిన ప్రశ్నలకు వారు సరైన సమాధానాలు చెప్పలేకపోయారు. 'వివాదాస్పద ఆస్తి సర్వే నంబర్ 165, 166లో ఉందని పిటిషనర్లు పేర్కొంటున్నారు. బిల్డింగ్ పర్మిషన్ 2022 నవంబర్‌లో తీసుకున్నారు. కానీ వాస్తవంగా అది సర్వే నంబర్ 164లో ఉంది. ఈ విషయం 2024 మార్చిలో తెలిసింది. ఏప్రిల్ 1న సర్వే చేశాం. ఏప్రిల్ 24న కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ కూడా సర్వే చేశారు. ఏప్రిల్ 2న పిటిషనర్లకు నోటీసులిచ్చాం. దానికి వారు ఏప్రిల్ 15, 18 తేదీల్లో వివరణ ఇచ్చారు. అనంత రం సెప్టెంబర్ 20న నోటీసు లు జారీ చేశాం. 22న ఉద యం హైడ్రా సాయంతో కూ ల్చివేత చేపట్టాం..'అని తహసీల్దార్ చెప్పారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని.. 'పిటిషనర్ల వాద నలు విన్నారా? బిల్డింగ్ అనుమతి రద్దు పై, విద్యుత్ తొలగింపుపై స్టే ఉంది తెలుసా? చట్టప్రకారం ముందుకు వెళ్లమని చెప్పాం కదా? శనివారం సాయంత్రం 6.30 గంటలకు నోటీసులు అందితే.. ఆదివారం ఉదయం 7.30 గంటలకు కూల్చివేస్తారా? అసలు ఆదివారం మీకు సెలవు కదా.. ఇంట్లో ఉండకుండా, అత్యవసరంగా విధులకు హాజరై మరీ కూల్చివేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఐదు నెలలుగా ఆగుతూ వచ్చి ఒక్క రోజులో కూల్చివేత ఎందుకు? సెప్టెంబర్ 20న ఇచ్చిన ఆదేశాల్లో ఖాళీ చేయడానికి 48 గంటల సమయం ఇచ్చారు కదా. ఆ గడువు పూర్తయ్యే వరకు ఎందుకు ఆగలేదు? కలెక్టర్ ఆదేశాలిస్తే చెప్పండి ఆయననూ పిలుస్తాం. ప్రజాస్వామ్య దేశంలో సహజ న్యాయ సూత్రాలను పాటించాలని మీకు తెలియదా?..'అంటూ ప్రశ్నల వర్షం కురిపించగా, తహసీల్దార్ సమాధానం చెప్పలేకపోయారు.

# మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వు బ్యాంకు

దేశవ్యాప్తంగా పార్టీ ఎన్నికల నిధుల కోసమే ఈ ప్రాజెక్టు చేపట్టిందన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న వారి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాల యముడిలా మారారన్నారు. ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లు కూలుస్తోందన్నారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి ఎలాంటి ప్రయోజనం లేని మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే గోపీనాథ్ తదితరులతో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 2400 కిలోమీటర్ల 'నమామీ గంగే'ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చయితే 55 కిలోమీటర్ల మూసీ ప్రక్షాళనకు రూ.లక్షన్నర కోట్లు ఎందుకని ప్రశ్నించారు. 'పేద మధ్య తరగతి ప్రజలకు సొంతిళ్లు ఒక భావోద్వేగం. అప్పర్, మిడ్ మానేరు నిర్వాసితులుగా కూ ల్చివేత బాధ ఏంటో మాకు తెలుసు. చట్టబద్ధంగా అనుమతులు పొందిన వారిని కూడా ఆక్రమణదారులుగా కాంగ్రెస్ ప్రచారం చేయిస్తోంది. నాలాల మీద నిర్మించిన హైడ్రా, జీహెచ్ఎంసీ భవనాలు కూల్చకుండా పేదల ఇళ్ల మీదకు బుల్డోజర్లు పంపిస్తున్నారు. కేసీఆర్ ఆనవాళ్ల లేకుండా చేసేందుకు సచివాలయాన్ని కూడా సీఎం రేవంత్ కూల్చివేస్తారేమో? రేవంత్‌ను ప్రజలు తిడుతున్న తిట్లు గతంలో ఎప్పుడూ నేను వినలేదు. రేవంత్ మీడియాకు ముఖం చాటేసి మంత్రులకు బదులు గా అధికారులను ముందు పెట్టి రాజకీయాలు చేస్తున్నాడు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీల్లో ప్రజల ఆక్రందనలు ఇలాగే ఉంటాయి. మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లు కూల్చిన తర్వాతే పేదల మీదకు రావాలి. చిత్తశుద్ధి ఉంటే కొడంగల్‌లోని తన ఇంటితోపాటు హైదరాబాద్‌లో తన సోదరుడు ఇంటిని కూడా రేవంత్ కూల్చివేయాలి. బాధితులకు భరోసా ఇచ్చేందుకు మూసీ పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తాం. బుల్డోజర్లకు మేము అడ్డుగా నిలబడతాం.

# లెబనాన్‌లోకి ఇజ్రాయెల్!

టెల్‌అవీవ్: హిజ్బుల్లా అంతమే లక్ష్యంగా కంకణం కట్టుకున్న ఇజ్రాయెల్ సేనలు.. సోమవారం అర్ధరాత్రి దాటాక లెబనాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లాయి. సోమవారం ఉదయం నుంచే అమెరికా వార్తా సంస్థలు సీఎన్ఎన్, వాషింగ్టన్ పోస్ట్ తమ వెబ్ ఎడిషన్లలో భూతల దాడులకు సర్వం సిద్ధం అంటూ కథనాలను అప్‌డేట్ చేస్తున్నా.. ఇజ్రాయెల్ మాత్రం అర్ధరాత్రి అధికారికంగా నిర్ధారించింది. ముందుగానే హెచ్చరికలు జారీ చేయడంతో లెబనాన్ సైన్యం సరిహద్దుల్లోని రమిష్, అబూషానన్ ప్రాంతాల్లోని పోస్టుల్లోంచి వెనక్కి వెళ్లినట్లు లెబనాన్ వార్తాపత్రిక అల్-నహర్ వెల్లడించింది. రాత్రి కడపటి వార్తలందేసరికి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస(ఐడీఎఫ్) యుద్ధట్యాంకులతో లెబనాన్‌లోని అల్-వజానీ, అల్-ఖియామ్‌వైపు దూసుకెళ్తున్నట్లు తెలిసింది. ఆ ప్రాంతాల్లో యుద్ధట్యాంకులు, ఫిరంగులతో దాడులు జరిగినట్లు అల్-మనార్ పత్రిక ప్రతినిధి షోఫర్ నిర్ధారించినట్లు లెబనాన్ వార్తాసంస్థలు పేర్కొన్నాయి.

తాజా పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాక్, ఇరాన్, సిరియాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆయా దేశాల ముఖ్య నాయకులు సోమవారం చేసిన ప్రకటనలు.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇరాన్ ప్రజలను ఉద్దేశించి ఆంగ్లంలో ఇచ్చిన సుదీర్ఘ వీడియో సందేశం కూడా ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి. ఇప్పటికే ఇజ్రాయెల్‌పై ఒకట్రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాక్.. నేరుగా కదనరంగంలోకి దిగుతామని సూత్రప్రాయంగా వెల్లడించింది. ఇరాన్ వేల మంది రివల్యూషనరీ గార్డ్స్, ఫైటర్లను లెబనాన్‌కు తరలించింది. మరోవైపు అమెరికా కూడా పశ్చిమాసియాకు ముందుజాగ్రత్తగా అదనపు బలగాలను పంపుతుంది.

**యుద్ధరంగంలోకి ఇరాక్?**

ఇజ్రాయెల్‌పై యుద్ధానికి సిద్ధమని ఇరాక్ ఎంపీ యాసర్-అల్-హుస్సేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఖతార్‌కు చెందిన బ్రిటన్ వార్తాసంస్థ అల్-అరబి ఓ కథనాన్ని ప్రసారం చేసింది. "ఇరాక్ చమురు క్షేత్రాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోనుందని, కీలక ప్రాంతాలపై దాడులకు సిద్ధమవుతోందని నిఘావర్గాలు మా ప్రధాని మహమ్మద్ షియా అల్-సుడానీకి సమాచారం అందించాయి. మా సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి మేం యుద్ధానికి సిద్ధమే" అని ఆయన వ్యాఖ్యనించినట్లు ఆ కథనంలో పేర్కొంది.

**ఫైటర్లను లెబనాన్‌కు తరలించిన ఇరాన్**

హిజ్బుల్లా చీఫ్‌తోపాటు.. తమ రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ అబ్బాసను అంతమొందించిన ఇజ్రాయెల్‌పై ఇరాన్ అగ్గిమీద గుగ్గిలమవుతోంది. అంతకు ముందు సిరియాలోని డమాస్కసపై ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లోనూ ఇరాన్ కమాండర్లు మృతిచెందారు. దీంతో ఇజ్రాయెల్‌పై ప్రతీకారానికి ఇరాన్ సిద్ధమైంది. హిజ్బుల్లాకు మద్దతుగా.. ఇరాన్ ఫైటర్లను, రివల్యూషనరీ గార్డ్స్‌ను వేల సంఖ్యలో లెబనాన్‌కు పంపినట్లు ఇజ్రాయెల్ వార్తా సంస్థలు కథనాలను ప్రచురించాయి.

**సిరియా కేంద్రంగా..**

అగ్ర నాయకత్వాన్ని కోల్పోయిన హిజ్బుల్లా.. హమాస్ ఉగ్రవాద సంస్థల ఫీల్డ్ కమాండర్లు రెండ్రోజులుగా సిరియా బాట పట్టినట్లు ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ గుర్తించింది. అక్కడ ఉన్న ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) నాయకులతో వీరు భేటీ అవుతున్నారని, కలిసికట్టుగా ఇజ్రాయెల్‌పై దాడులకు సిద్ధమవుతున్నారని నిర్ధారించినట్లు ఇజ్రాయెల్ వార్తా సంస్థ 'వైనెట్' పేర్కొంది. మరోవైపు సిరియాపై జరుగుతున్న దాడులపై ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు హిజ్బుల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ నయీం కాసీమ్ సోమవారం ఓ అరబిక్ టీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ.. ఇజ్రాయెల్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తామని, శత్రువు తమ భూభాగంలోకి ప్రవేశిస్తే గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తమ మిలటరీ సామర్థ్యాన్ని ఇజ్రాయెల్ అంచనా వేయలేదని తెలిపారు. కాగా, ఐడీఎఫ్ వైమానిక దళం సోమవారం కూడా లెబనాన్‌పై భీకరదాడులు జరిపింది. ఆదివారం దాడుల్లో 105 మంది చనిపోయారు. ఆదివారం రాత్రి జరిపిన దాడిలో హిజ్బుల్లా మీడియం రేంజ్ మిసైల్స్ బృందం కమాండర్ ఈద్-హసన్ నెషార్‌ను అంతమొందించినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఇరాన్ పౌరులను ఉద్దేశించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సుదీర్ఘ వీడియో సందేశం, లేఖను విడుదల చేశారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ చొరబడని ప్రదేశమంటూ లేదని చెబుతూనే.. ఇరాన్ పౌరులు మతోన్మాద శక్తుల ఉచ్చులో పడొద్దని హితవు పలికారు. "మతోన్మాదంతో మీ కలలను నాశనం చేసుకోవద్దు. మీలో మతోన్మాద విష బీజాలు నాటే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. మా ప్రజలను, మా దేశాన్ని రక్షించుకునేందుకు మేం ఎక్కడిదాకా అయినా వెళ్తాం.

# సిద్ధరామయ్యపై ఈడీ కేసు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు లోకాయుక్త పోలీసులు శుక్రవారం సిద్ధరామయ్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో సిద్ధరామయ్యను ఏ1గా, ఆయన భార్య బీఎం పార్వతిని ఏ2గా, బావమరిది మల్లికార్జున స్వామిని ఏ3గా, దేవరాజును ఏ4గా పేర్కొన్నది. దేవరాజు వద్ద నుంచే మల్లికార్జున స్వామి భూమిని కొని పార్వతికి బహుమతిగా ఇచ్చాడని చెప్తున్నారు. తక్కువ విలువ కలిగిన ఈ భూమిని అభివృద్ధి పనుల కోసం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) సేకరించి, పరిహారంగా పార్వతికి ఖరీదైన 14 స్థలాలను కేటాయించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా వీరిపై తాజాగా ఈడీ ఈ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదుచేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం దర్యాప్తు సమయంలో నిందితులను ప్రశ్నించేందుకు, వారి ఆస్తులను అటాచ్ చేసేందుకు ఈడీకి అధికారం ఉంది. తనకు ప్రభుత్వం కేటాయించిన 14 స్థలాలను వెనక్కి ఇచ్చేస్తానని సిద్ధరామయ్య సతీమణి పార్వతి. ముడా కమిషనర్‌కు లేఖ రాశారు. తన నుంచి ప్రభుత్వం తీసుకున్న కేసరె గ్రామంలోని మూడెకరాల 16 గుంటల భూమికి బదులుగా ముడా మైసూర్‌లోని విజయనగర్‌లో 14 ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించిందని, అయితే దానికి సంబంధించిన సేల్‌డీడ్‌ను రద్దు చేయడం ద్వారా స్థలాలు వెనక్కి ఇచ్చేయడానికి తాను సిద్ధమని ముడా కమిషనర్‌కు రాసిన లేఖలో తెలిపారు. ఈ భూముల కేటాయింపుకు సంబంధించి సిద్ధరామయ్యపై లోకాయుక్త విచారణ నేపథ్యంలోనే ఆమె ఈ లేఖ రాసినట్టు భావిస్తున్నారు.

# 9న టీచర్ నియామక పత్రాలు

హైదరాబాద్: డీఎస్సీ-2024 కింద ఎంపిక య్యే ఉపాధ్యాయులకు అక్టోబర్ 9న ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో నియామక ప త్రాలను అందజేస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దసరా నాటికి టీచర్ల నియామక ప్రక్రియ పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ మేరకు 65 రోజుల్లోనే డీఎస్సీ పూర్తి చేశామని.. విద్యను పేదవాడి ముంగిటకు చేర్చడ మే ధ్యేయంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ నియామక పరీక్ష ఫలితాలను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తమ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. డీఎస్సీ రాసిన వారి మెరిట్ జాబితాల్లోంచి ఒక్కో పోస్టుకు ముగ్గురి చొప్పున ఎంపిక చేస్తామని.. ఆ జాబితాలను జిల్లా సెలక్షన్ కమిటీ (డీఎస్సీ)కి పంపుతామని సీఎం చెప్పారు. అక్కడ తుది ఎంపిక జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒకే ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని.. అదీ 7,857 మంది టీచర్లనే నియమించిందని పేర్కొన్నారు. అదే తాము అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లోనే వివిధ ప్రభుత్వ శాఖల్లో 30 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. పది నెలల్లోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు అడుగులు వేశామని చెప్పారు. ఉపాధ్యాయులు అంటే ఉద్యోగి కాదని, ఓ భావోద్వేగమని సీఎం అభివర్ణించారు. కీలకమైన ఈ రంగం గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. విద్యా రంగానికి భవిష్యత్‌లో మరిన్ని నిధులు ఇస్తామని.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తామని ప్రకటించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, వివాదాలకు తావివ్వకుండా పరీక్షలు నిర్వహించామని సీఎం తెలిపారు. గ్రూప్%-%1 పరీక్ష ఫలితాలను త్వరలోనే విడుదల చేస్తామన్నారు.

**నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్**

రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించినట్టు సీఎం రేవంత్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఒకే చోట ఉంచి విద్యను అందించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. ప్రతీ రెసిడెన్షియ ల్ స్కూల్‌ను 20 నుంచి 25 ఎకరాల్లో రూ.125 కోట్ల వ్యయంతో నిర్మిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం మధిర, కొడంగల్ నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా వీటిని చేపడుతున్నామని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీల మీడియాలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. గత పదేళ్లు ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తే ఎందుకు ప్రశ్నించలేదన్నారు. విద్యార్థు ల సంఖ్యతో ప్రమేయం లేకుండా ప్రభుత్వ బడులను కొనసాగిస్తామని ఓ ప్రశ్నకు బదులుగా చెప్పారు.

# నేరస్థులను వదలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

'టెక్నాలజీకి ప్రాధాన్యం ఇవ్వాలి. కేసుల్లో శిక్షలు పెరిగితేనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయన్న మీ పోలీసు సూత్రాన్ని గట్టిగా అమలుచేయండి' అని సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది. జగన్ పాలనలో వైసీపీ నేతలు రాష్ట్రమంతా దోచేశారని, ఇసుక దోపిడీలో తవ్వే కొద్దీ అక్రమాలు ఉన్నాయని అన్నట్టు సమాచారం. సహజ, ప్రభుత్వ వనరులు దోపిడీ చేసిన వ్యక్తులు ఎంతటి వారైనా వదిలి పెట్టొద్దని ఆదేశించారు. ప్రజల నుంచి వేలాది ఫిర్యాదులు టీడీపీ కార్యాలయానికి వస్తున్నాయని, అందులో భూ సంబంధింత అక్రమాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రజల్ని వేధించి హింసించిన వ్యక్తుల్ని జైల్లో పెట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన ఇళ్లను రాక్రీట్ అనే సంస్థకు ఎలాంటి టెండర్ లేకుండా కట్టబెట్టిన వైనాన్ని విజిలెన్స్ డీజీ హరీశ్ కుమార్ గుప్తా వివరించారు. అప్పటి రాప్తాడు వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి సోదరుడికి చెందిన సంస్థ చేపట్టిన పనుల కన్నా కోట్లాది రూపాయల బిల్లులు అధికంగా డ్రా చేసుకున్నట్లు విజిలెన్స్ విచారణలో తేలిందన్నారు. మొత్తం ఏడు జిల్లాల్లో 52 వేల ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టు తీసుకుని 23 వేల ఇళ్లకు పైగా పూర్తి చేయలేదని, ఇప్పటి వరకూ అందిన సమాచారం మేరకు 50 కోట్లకు పైగా అదనపు చెల్లింపులు జరిగాయని వివరించినట్లు తెలిసింది. ఇలాంటి దోపిడీతో పాటు మదనపల్లె ఫైల్స్ లాంటివి రాష్ట్రంలో చాలా చోట్ల ఉన్నాయని, పోలీసు శాఖ సీరియ స్‌గా తీసుకోవడం లేదని సీఎం వ్యాఖ్యానించారు. చిన్న భూకబ్జా అయినా బాధ్యులకు శిక్ష పడేలా చూడాలని, బాధితులకు న్యాయం జరగాలని అన్నట్టు తెలిసింది. మద్యపాన నిషేధం పేరుతో ప్రజల్ని మోసగించి అధికారంలోకి వచ్చిన జగన్.. వేల కోట్లు ప్రజల నుంచి పీల్చేశారని, అవినీతి సొమ్ము మొత్తం కక్కిస్తేనే భవిష్యత్తులో ఇలాంటి వాటికి ఆస్కారం ఉండదన్నారు. ఈ కేసులో కొంత పురోగతి సాధించామని, ఏపీ బేవరేజెస్ కార్యాలయంలో జరిపిన సోదాల్లో భారీగా డాక్యుమెంట్లు సీజ్ చేశామని ఈ సందర్భంగా సీఐడీ ఏడీజీ చెప్పినట్టు తెలిసింది. సైంటిఫిక్, డిజిటల్ ఎవిడెన్స్‌తో బాధ్యులకు కోర్టుల్లో శిక్షలు పడేలా ఉచ్చు బిగించాలని సీఎం సూచించినట్లు సమాచారం.

# చదువుతోపాటు, క్రీడల్లో కూడ రాణించాలి: జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్

- విద్యలో, ఆటల్లో పోటీతత్వాన్ని కలిగి ఉండాలి.
- జిల్లా యువత మరియు పోలీసు ల మధ్య సత్సంబంధాలు అభివృద్ధి కె ఇలాంటి క్రీడల పోటీలు నిర్వహణ.
- క్రీడల వల్ల విశ్వాసం, నమ్మకం, క్రీడా స్ఫూర్తి అభివృద్ధి సాధ్యం అవుతుంది
- డ్రగ్స్ మరియు సైబర్ క్రైమ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన.
- గుడిహత్నూర్ ఆదర్శ పాఠశాల నందు జిల్లా వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ.
- వాలీబాల్ టోర్నమెంట్ లో పాల్గొననున్న 50 జట్టులు.





**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా యువత మరియు పోలీసు సత్సంబంధాలను మెరుగుపరిచేందుకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ ను ఈరోజు గుడిహత్నూర్ మండలం ఆదర్శ పాఠశాల నందు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ ప్రారంభించడం జరిగింది. మొదటగా ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా ఎస్పీకి డప్పు వాయిద్యాలు నడుమ ఘనంగా స్వాగతం పలికి వేదికపై ఆహ్వానించారు. మొదటగా క్రీడలకు సంబంధించి జెండాను ఆవిష్కరించి, గలిలోకి బెలూన్లను మరియు పావురాలను వదిలి క్రీడలను ప్రారంభించారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్ నందు ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాలలోని యువత 50 జట్టులుగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజల రక్షణ కై, ప్రజల కొరకై విధులను నెరవర్తిస్తారని ఎలాంటి భయాందోళనలు లేకుండా పోలీసులతో మమేకం కావాలని తెలిపారు. యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించి జాతీయస్థాయి పోటీలలో పాల్గొని ఎదగాలని జిల్లా ఎస్పీ తెలిపారు. మారుమూల గ్రామాల్లో ఉన్న యువత యొక్క నైపుణ్యాన్ని, క్రీడలపై ఉన్న ఆసక్తిని వెలికి తీసేందుకే ఇలాంటి టోర్నమెంట్లను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రంగంలోనూ విద్య మరియు ఆటల్లో ప్రతి ఒక్కరూ పోటీ తత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. క్రీడలు ఆడటం వల్ల మానసిక శారీరక ప్రశాంతత మరియు యువతకు తమపై ఉన్న విశ్వాసం, నమ్మకం అధికమవుతుందని, క్రీడా స్ఫూర్తి అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అదేవిధంగా ముఖ్యంగా ప్రస్తుతం యువత డ్రగ్స్ మరియు సైబర్ క్రైమ్ బారిన పడకుండా ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతి, సోషల్ మీడియా యొక్క దుర్వినియోగం, గంజాయి యొక్క దుర్వినియోగం, గంజాయి వాడడం వల్ల భవిష్యత్తు మరియు ఆరోగ్యం పాడవుతుందని తెలియజేశారు. గంజాయి పై తమ మిత్రులకు మరియు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ క్రైమ్ ఎక్కువగా మొబైల్ ఫోన్ వినియోగించడం సోషల్ మీడియాలో గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకోవడం వల్ల ఎక్కువగా జరుగుతాయని, ఇలాంటివి సంభవించినప్పుడు వెంటనే జాతీయ హెల్ప్ లైన్ నెంబర్ - 1930 కు గాని, డయల్ 100 కు గాని సమాచారం అందించి సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ క్రీడలు ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఆడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డిఎస్పి సిహెచ్ నాగేందర్, సిఐలు భీమేష్, రహీం భాష, ఎస్సైలు ఇమ్రాన్, తిరుపతి, నవీన్, శ్రీకాంత్, కళాశాల అధ్యాపకులు, పీఈటీలు, క్రీడాకారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ పొందిన పోలీస్

**విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్ష**

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల, సెప్టెంబర్ 30 ( డైలీ రిపోర్ట్):** విధి నిర్వహణలో అందరి మన్నన అందుకొని పదవీ విరమణ పొందుతున్న ఏఎస్ఐ వాలి బెగ్, హెడ్ కానిస్టేబుల్ రాజయ్యలను శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను సోమవారం అందజేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అందజేశారు.జగిత్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణలో ముఖ్య అతిథిగా పాల్గొన ఎస్పీ మాట్లాడుతూ అనేక త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. విజయవంతంగా సర్వీస్ పూర్తి చేసిన అధికారుల సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యుల తో ఆనందంగా, భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షి%శీ%చారు.పదవి విరమణ పొందిన అధికారులను పోలీసు వాహనంలో ఎక్కించి పోలీస్ బ్యాండ్ తో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు కిరణ్, వేణు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



30జెజిఎల్ పి 5,6,7,8 పదవీ విరమణ పొందిన పోలీసుల సన్మానించి మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, విరమణ పొందిన పోలీసుల పోలీస్ వాహనాల్లో ఊరేంచి స్వస్థలాలకు తరలిస్తున్న దృశ్యాలు.

# ఎం.ఎల్.సి. ఎన్నికల కొరకు అర్హత గల వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల డైలీ రిపోర్ట్ బ్యూరో :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎం.ఎల్.సి. ఎన్నికల నిర్వహణ కొరకు కార్యచరణ ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని, అర్హత గల వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ సోమవారం తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎం.ఎల్.సి. ఎన్నికలకు సంబంధించి కార్యచరణ విడుదల చేయడం జరిగిందనీ, అర్హత గల వారు పట్టభద్రుల ఎం.ఎల్.సి. కొరకు ఫారం-18, ఉపాధ్యాయుల ఎం.ఎల్.సి. కొరకు ఫారం-19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, అక్టోబర్ 16వ తేదీన మొదటి రిపబ్లికేషన్, 25వ తేదీన రెండవ రిపబ్లికేషన్ చేయడం జరుగుతుందని, నవంబర్ 6వ తేదీన నమోదు చేసుకునేందుకు ఆఖరి తేదీగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. నవంబర్ 20వ తేదీన నమోదు అయిన దరఖాస్తులను పరిశీలించి ముసాయిదా జాబితా సిద్ధం చేసి 23న ప్రచురించడం జరుగుతుందని, 23 నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, డిసెంబర్ 25వ తేదీన ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించి సంబంధిత పత్రాలను పరిశీలించి 30వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. మెదక్ - నిజామాబాద్- ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాలకు జరుగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎం.ఎల్.సి. ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. వివరాల కొరకు, దరఖాస్తు చేసుకునేందుకు ఆన్లైన్ లో, తహశిల్దార్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

# మూసివేసిన బతుకమ్మ కుంటను పునరుద్ధరించండి

**మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎమ్మార్వో సురేందర్ కు వినతి పత్రం అందజేసిన సింగాపురం కాలనీవాసులు**

శంకర్‌పల్లి: సెప్టెంబర్ 30: (డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగాపురం వార్డులో ఆడపడుచులు బతుకమ్మ ఆడుకోడానికి వీలుగా గతంలో ఉన్న బతుకమ్మ కుంటను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం వార్డు ప్రజలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేందర్ లకు వినతిపత్రం అందించారు. 1, 9, 10వార్డులలోని సర్వే నం. 390 లో బతుకమ్మ కుంట ఉండేది. ప్రతి ఏడాది బతుకమ్మ పండుగ రోజు ఆడపడుచులు బతుకమ్మ ఆడిన తర్వాత ఆ కుంటలో వేసేవారు. గత ఏడాది పండగ తర్వాత ఆ కుంటను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మూసి వేశారు. దీన్ని మళ్లీ పునరుద్దించాలని, మూసివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి, దయాకర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, దేవయ్య, మల్లేష్, సురేష్. శ్రీశైలం, నరహరి ఉన్నారు.



# ప్రజాల సమస్య పరిష్కారానికి ప్రజావాణి

**కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 30 ,(డైలీ రిపోర్ట్):** ప్రజా సమస్యలు పరిష్కారం చేసినందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నాను సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల సమస్యలు పరిష్కారం చేసినందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. లబ్దాలు ఇచ్చిన దరఖాస్తులను శాఖల వారిగా పంపించి సమస్యను పరిష్కారం చేసినందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్ఓ పద్మజా రాణి తో పాటు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు

# డీఎస్సీ ఎస్ జి టి లో జిల్లా లో 1 ర్యాంక్ సాధించిన హెడ్ కానిస్టేబుల్ కూతురు గిన్నెల ప్రవళిక



**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** అదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలోని భూక్తా పూర్ కాలనీకి చెందిన గిన్నెల ప్రవళిక కు ఎస్ జి టి లో జిల్లా లో ఫస్ట్ ర్యాంకు సంపాదించింది. . చిన్నప్పటినుండి ప్రవళిక చదువులో ముందుండేదని....10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ లో కూడా మంచి మార్కులు సంపాదించిందని ఆమె తల్లి దండ్రులు విజయ- సత్య మోహన్ లు తెలిపారు. ప్రవళిక తండ్రి సత్య మోహన్ పట్టణంలో 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా షి టీం బృందంలో పని చేస్తున్నారు... ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లాలో ఫస్ట్ ర్యాంకు సంపాదించింది.. ఈ సందర్భంగా... ప్రవళిక మాట్లాడుతూ.... ఎంతో కష్టపడి చదవడం వల్ల,తల్లి దండ్రుల ప్రోత్సాహం వల్ల తను జిల్లాలో ఫస్ట్ ర్యాంకు సాధించగలిగానని ఫస్ట్ ర్యాంకు సాధించడం ఎంతో సంతోషకరంగా ఉందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. డీఎస్సీ ఎస్ జి టి లో 83.53 మార్కులు వచ్చాయని,టెట్ లో 139/150 వచ్చాయని ఆమె తెలిపారు.

# అనుమానాస్పదలో మహిళా మృతి





**మంచిర్యాల డైలీ రిపోర్ట్ బ్యూరో:** మంచిర్యాల పట్టణంలోని మేదరి వాడలో సోమవారం అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెంది ఉన్నట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం చింత విజయలక్ష్మి (47) తన ఇంటి హాల్ లో అనుమానాస్పదంగా చనిపోయిందని సమాచారం రాగా సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మెడపై, చేతులపై బలవంతంగా చంపినట్లుగా కమిలిపోయిన గాయాలున్నాయన్నారు. విజయలక్ష్మి కి, తన బంధువులకు మధ్య ఉన్న ఆస్థి తగాదాల కారణంగా చంపారా లేదా ఇంకా ఇతర కాలంలో ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నామన్నారు. విజయలక్ష్మి కూతురు రాపాల భవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు.

# మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ... పట్టపగలే ...ఓ మహిళ దారుణంగా హత్య..!



శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 30 (డైలీ రిపోర్ట్): మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలే ఓ మహిళ దారుణంగా హత్యకు గురైన సంఘటన కలకలం రేపింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్ లోని సిబిఆర్ ఎస్టేట్ లో స్పందన (29)అనే వివాహిత భర్త తో గొడవల కారణంగా ఒంటరిగా నివసిస్తోంది. గత కొన్ని రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని, ప్రస్తుతం వారి విడాకుల కేసు కోర్టులో ఉండగా సోమవారం ఉదయం 10-1 1గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆమెను దారుణంగా హత్య చేసినట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# స్ఫూర్తి ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో భారత సేవా రత్న నేషనల్ అవార్డు గ్రహీతగా నీరుడి మహేష్ ముదిరాజ్








**హైదరాబాద్ సెప్టెంబర్ 30 (డైలీ రిపోర్ట్):** సోమవారం హైదరాబాద్ సరస్వతి ఆడిటోరియం లో స్ఫూర్తి ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను గుర్తించి భారత సేవా రత్న అవార్డు గ్రహీతగా జిన్నారం మండలం రాళ్లకత్త గ్రామానికి చెందిన నీరుడి మహేష్ ముదిరాజ్ కి పలు సేవా కార్యక్రమాలు సోషల్ ఆక్టివిటీస్ గుర్తించి స్ఫూర్తి ఎన్జీవో సంస్థ డాక్టర్ ఆకుల రమేష్ సరస్వతి ఆడిటోరియంలో పలు ఆర్గనైజర్స్ జాతీయ నాయకుల చేతులమీదుగా మహేష్ ముదిరాజ్ కి శాలువాతో సత్కరించి మెడల్ వేసి అవార్డును అందించడం జరిగింది నీరుడు మహేష్ మాట్లాడుతూ ఈ అవార్డు ఇచ్చినందుకు స్ఫూర్తి ఎన్జీవో సమస్త ఆర్గనైజర్ డాక్టర్ ఆకుల రమేష్ కి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ అవార్డు తీసుకున్నందుకు మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తానని బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి గా నిలుస్తానని ఆయన పేర్కొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## వనరుల పరిరక్షణ, సమర్ధవంత వినియోగమే సుస్థిర అభివృద్ధి

### జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు..




అశంకర్ పల్లిబీ సెప్టెంబర్ 30:(డైలీ రిపోర్ట్): నేషనల్ గ్రీన్ కాప్స్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం శంకర్ పల్లి లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల సుస్థిర అభివృద్ధి పైన అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుండి ఒక సైన్స్ టీచర్, ప్రతి పాఠశాలకు ముగ్గురు చొప్పున విద్యార్థులను తీసుకొని ఈ కార్యక్రమానికి వచ్చారు. ఈ ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నటువంటి వనరులు పరిమితంగా ఉన్నాయని వాటిని అవసరం మేరకు మాత్రమే వాడుకుంటూ సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. భవిష్యత్ తరాల వారికి వనరులను మిగిల్చి ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అదేవిధంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులకు ప్రత్యామ్నాయ వనరుల అన్వేషణ జరగాలన్నారు దీనిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి పేర్కొన్నారు. ఉన్న వనరులను జాగ్రత్తగా సమర్థవంతంగా వినియోగించుకోవడమే సుస్థిరాభివృద్ధి అన్నారు.. ఉపాధ్యాయ సంఘ నాయకులు రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మొదటిసారిగా శంకర్ పల్లి మండలంలో నిర్వహించడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు. చేవెళ్ల డివిజన్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా చేవెళ్ల డివిజన్లో ఉన్నటువంటి విద్యార్థులు ఉపాధ్యాయులు లబ్ధి పొందడానికి అవకాశం ఉందని తెలిపారు. మరిన్ని కార్యక్రమాలను చేవెళ్ల డివిజన్లో నిర్వహిస్తే పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. రిసోర్స్ పర్సన్ శేఖర్ మాట్లాడుతూ ఎల్ఈడి విద్యుత్ బల్బులను వాడటం ద్వారా విద్యుత్తును సుమారు 80% విద్యుత్తు ఆదా చేయవచ్చని తెలిపారు. ఎల్ఈడి ట్యూబ్ లైట్లు తయారీని నేర్చుకొని తమ ఇళ్లలో ఈ బల్బులను ఉపయోగించాలని సూచించారు. ఎల్ఈడి ట్యూబ్ లైట్ల తయారీ విధానాన్ని ఆయన వివరించారు. వివిధ పాఠశాలల నుండి విచ్చేసిన ఉపాధ్యాయులు మరియు విద్యార్థులకు ఎల్ఈడి బల్బులను తయారు చేసుకునే విధానాన్ని సూచిస్తూ స్వయంగా వారి చేత తయారు చేయించారు. అదేవిధంగా కృత్రిమ ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా నేల సంరక్షణ చేపట్టవచ్చని పంట ముక్కలను ఆరోగ్యంగా ఉంచవచ్చని రిసోర్స్ పర్సన్ లు తెలిపారు. వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని కూడా విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిసోర్స్ పర్సన్లు రమేష్, సాయి లతో పాటు రంగారెడ్డి జిల్లాలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదిగలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాం...

## మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు...



పాపన్నపేట:(డైలీ రిపోర్ట్) సెప్టెంబర్ 30: మాదిగ ,మాదిగ ఉప కులాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, వారిని తమ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనపల్లి రోహిత్ రావు వెల్లడించారు, పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకుడు అల్లారం రత్నయ్య ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మాదిగ, మాదిగ ఉపకులాగా ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా మాదిగ రిజర్వేషన్ల కోసం మాదిగలు పోరాడుతున్నారని, ఇటీవల సుప్రీంకోర్టు మాదిగ రిజర్వేషన్లు ను ఆయా రాష్ట్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించిందని, దీన్ని తమ ప్రభుత్వం అమలు చేస్తుందని, ఎమ్మెల్యే రోహిత్ రావు వెల్లడించారు. మాదిగల అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని , వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఆయన వెల్లడించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లారం రత్నయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే రోహిత్ రావు తమకు అండగా ఉంటే తాము వారి వెంట ఎల్లవేళలా ఉంటామని వెల్లడించారు. మాదిగ రిజర్వేషన్లను వెంటనే అమలు చేయడానికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు తమ వంతు కృషి చేయాల్సిందిగా ఆయన కోరారు...

**అల్లారంకు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వాలి...**

ఎల్లవేళలా కుల మతాలకతీతంగా దళిత వర్గాలను అక్కున చేర్చుకొని సేవలందిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు అల్లారం రత్నయ్యకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని, సమావేశానికి హాజరైన దళిత నాయకులు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావుకు విజ్ఞాపన పత్రం అందజేశారు. పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ రిజర్వేషన్ అయిన విషయాన్ని వారు గుర్తు చేస్తూ, కుల మతాలకతీతంగా బీదల పెన్నిధిగా పేరుగాంచిన రత్నయ్య కు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇచ్చి ఆయనకు సరియైనన్యాయం చేయాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి ప్రశాంత్ రెడ్డి త్యార్ల రమేష్, తో పాటు దళిత సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల అవగాహన




**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 30: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో సోమవారం 6,7,8,9,10,11,12,13 వార్డులలో మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ- 2024 కార్యక్రమంలో భాగంగా ఎస్ హెచ్ జి మహిళలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బి. శానిటరీ ఇన్స్పెక్టర్, కౌన్సిలర్లు, వార్డు అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## తిరుపతి లడ్డు ప్రసాదం అపవిత్రం చేసినందున వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన

**సంగారెడ్డి డైలీ రిపోర్ట్:** సంగారెడ్డి జిల్లా నియోజకవర్గంలోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం అపవిత్రను వ్యతిరేకిస్తూ పేస్ 2 పోతిరెడ్డిపల్లి శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం నుండి ర్యాలీలో పాల్గొన్న రాజేశ్వర్ రావ్ దేశ్ పాండే, విశ్వవిందు పరిషత్ సంఘాలు బ్రాహ్మణ సంఘాలు వివిధ ఆలయాల అర్చకులు వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

## కొమరవెల్లి మల్లన్న హుండీ లెక్కింపు



**చేర్యాల 30 సెప్టెంబర్ (డైలీ రిపోర్ట్):** చేర్యాల కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం రోజున, కొమురవెల్లి మల్లన్న ఆలయ కార్య నిర్వాణ అధికారి బాలాజీ ఆధ్వర్యంలో శ్రీ కొమురవెల్లి మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు జరిగింది. 76 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు, మిశ్రమ బంగారం 51గ్రాములు, మిశ్రమ వెండి 05కి లోల 050గ్రాములు, విదేశీ కరెన్సీ 25 ఎన్ ఒ ఎస్, మిశ్రమ బియ్యం 06 కింటలు, నగదు 63 లక్షల 66 వేల 933 రూపాయలు సమాకూరింది. ఈ కార్యక్రమంలో, ఏఈఓ బాలాజీ, ఎం చంద్రశేఖర్, అసిస్టెంట్ కమిషనర్, మెదక్ జిల్లా ప్రధాన అర్చకులు, మల్లికార్జున్, ఆలయ కార్య నిర్వహణ అధికారి బుద్ధి శ్రీనివాస్, ఏపీజీబీ బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన టీజీఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి





**సంగారెడ్డి, సెప్టెంబర్ 30(డైలీ రిపోర్ట్):** సోమవారం ఉదయం సంగారెడ్డి లో టిజిఐఐసి చైర్మన్ నిర్మల రెడ్డి ఆధ్వర్యంలో పోతిరెడ్డిపల్లి పిఎస్ఆర్ గార్డెన్ లో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా ఎంపీ కొండ సురేఖ, మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై పంపిణీ చేయాల్సి ఉండగా వారు రాకపోవడంతో . ఇట్టి కార్యక్రమాన్ని యధావిధిగా టీజీఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి, తాసిల్దార్ దేవదాస్ ల చేతుల మీదుగా సంగారెడ్డి నియోజకవర్గంలోని వివిధ మండలాల కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ 741 లబ్దిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, తాసిల్దారులు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య



**రాజన్న సిరిసిల్ల:సెప్టెంబర్ 30(డైలీ రిపోర్ట్):** భార్యా భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో సోమవారం నాడు చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గంగ (21) కు ఏడాదిన్నర క్రితం చింతల్ టనా కు చెందిన ఓ యువకుడుతో వివాహమైంది. అయితే ఈ మధ్యకాలంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గంగ తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. దీంతో మనస్థాపానికి గురైన గంగ సోమవారం నాడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707